## క్లుప్తంగా

### పారదర్శక సేవలు అందించండి

కాకినాడ: ఎన్నికల విధులకు నియమితులైన పీఓ, ఏపీఓలకు రెండో రోజైన శుక్రవారం కూడా శిక్షణ కార్యక్రమం కొనసాగింది. వీరికి సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జె.వెంకటరావు పర్యవేక్షణలో స్థానిక పీఆర్ ప్రభుత్వ కళాశాలలో మాస్టర్ ట్రైనర్లు శిక్షణ ఇచ్చారు. సుమారు 250 మంది హాజరు కాగా.. ప్రధానంగా ఈవీఎం, వీవీ ప్యాట్ల నిర్వహణ, వాటి పనితీరు, ఎన్నికల విధుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఇతర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆర్వో వెంకటరావు మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో ఉండే సిబ్బంది ప్రతి ఒక్క అంశాన్ని క్షుణ్ణంగా అర్థం చేసుకుని పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి ఉద్యోగి సమన్వయంతో పనిచేసినప్పుడే సమర్థవంతమైన సేవలు అందించగలమని స్పష్టం చేశారు. డిప్యూటీ కమిషనర్ గుంటూరు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

### దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాల ఏర్పాటు

బోట్‌క్లబ్: బాటసారుల దాహార్తి తీర్చేందుకు మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు పోలిశెట్టి ఈశ్వరరావు అన్నారు. స్థానిక దేవాలయం వీధిలోని ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా డిస్ట్రిబ్యూషన్ స్టాకిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని ఆయన శుక్రవారం ప్రారంభించారు. రోజురోజుకీ పెరుగుతున్న ఎండలకు ప్రజలు, బాటసారుల దాహార్తి తీర్చేందుకు ఈ మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశామన్నారు. అసోసియేషన్ సెక్రటరీ రామారావు, ట్రెజరర్ బోసు, గౌరవ అధ్యక్షుడు ఆర్ఎస్ఎస్ మూర్తి, మాజీ అధ్యక్షుడు మురళీకృష్ణ పాల్గొన్నారు.

### ల్యాండ్ టైట్లింగ్ చట్టంపై దుష్ప్రచారం



ల్యాండ్ టైట్లింగ్ చట్టంపై దుష్ప్రచారాన్ని ఖండిస్తున్న న్యాయవాదులు

కాకినాడ: అమలులోకి రాని ల్యాండ్ టైట్లింగ్ చట్టంపై దుష్ప్రచారం సరికాదని కాకినాడకు చెందిన న్యాయవాదులు పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ లీగల్‌సెల్ ఆధ్వర్యంలో శుక్రవారం కాకినాడ మెయిన్‌రోడ్డులో న్యాయవాదులు ఈ అంశంపై విస్తృత ప్రచారం చేశారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ స్థానిక వ్యాపారులు, ప్రజలను కలసి టీడీపీ చేస్తున్న దుష్ప్రచారాన్ని నమ్మవద్దని సూచించారు. కేంద్రం తీసుకొచ్చిన ఈ ప్రతిపాదనతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి ఎటువంటి సంబంధం లేకపోయినా ల్యాండ్ టైట్లింగ్ చట్టం ద్వారా భూములు కాజేసే అవకాశం ఉందంటూ పథకం ప్రకారం దుష్ప్రచారం చేస్తున్నారంటూ మండిపడ్డారు. రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని రాజకీయ ప్రయోజనాల కోసమే ఇలాంటి తప్పుడు ఆరోపణలకు దిగారని అన్నారు. అలాగే వైఎస్సార్ సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు చల్లమలశెట్టి సునీల్, ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డిలను గెలిపించాలంటూ ప్రచారం చేశారు.

### కాంగ్రెస్ ప్రచారం

కరప: రాష్ట్రాభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని కాకినాడ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి మల్లిపూడి మంగపతి పళ్లంరాజు అన్నారు. రూరల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి సత్యలక్ష్మి, పార్టీ నాయకులతో కలసి నడకుదురు, పెనుగుదురు, కరప, వలసపాకల, పెదకొత్తూరు తదితర గ్రామాల్లో రోడ్ షో నిర్వహించారు.

### దేశ రక్షణ కోసమే పొత్తు



సమావేశంలో మాట్లాడుతున్న హనుమంతరావు, పళ్లంరాజు తదితరులు

కాకినాడ సిటీ: దేశ ప్రజల రక్షణ కోసమే ఇండియా పేరుతో వివిధ రాజకీయ పార్టీలు పొత్తు పెట్టుకున్నాయని కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ, ఆప్ పార్టీ నేతలు తెలిపారు. కాకినాడలోని ఓ హోటల్‌లో ఇండియా కూటమిని గెలిపించాలని నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయా పార్టీల నేతలు మాట్లాడారు. ఏఐసీసీ సభ్యుడు వి.హనుమంతరావు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ పాలనలో రైతులకు, మహిళలకు తీవ్ర ద్రోహం జరిగిందన్నారు. బీజేపీ పెద్దల కోసం పోరాడుతుంటే, కాంగ్రెస్ మాత్రం పేదల అభివృద్ధి గురించి పని చేస్తుందన్నారు. భారత రాజ్యాంగాన్ని మార్చడానికి బీజేపీ కుట్ర పన్నుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ కాకినాడ పార్లమెంట్ అభ్యర్థి ఎంఎం పల్లంరాజు మాట్లాడుతూ దేశ రక్షణకు ఇండియా కూటమిలోని పార్టీలు పని చేస్తున్నాయన్నారు. సీపీఎం నాయకులు దువ్వా శేషుబాబ్జీ, ఎం.రాజశేఖర్, సీపీఐ నాయకులు కె.బోడకొండ, ఆప్ నాయకులు నరాల శివ, కృష్ణమోహన్, వరదరాజులు, కాంగ్రెస్ సిటీ అభ్యర్థి చెక్కా నూకరాజు, రూరల్ అభ్యర్థి పిల్లి సత్యలక్ష్మి పాల్గొన్నారు.

### వలంటీర్ల రాజీనామా

కరప: మండలంలోని మరో 18 మంది వలంటీర్లు శుక్రవారం స్వచ్ఛందంగా రాజీనామా చేసి ఎంపీడీఓ అప్పారావుకు ఆ పత్రాలను సమర్పించారు. వీరితో వలంటీర్ల రాజీనామా 80కు చేరుకుంది. అరట్లకట్టలో ఇద్దరు, కరప–2లో ఒకరు, నడకుదురు–1లో 14 మంది, నడకుదురు–2లో ఒకరు చొప్పున రాజీనామా చేసినట్టు ఎంపీడీఓ తెలిపారు.

# గొప్ప మానవతావాది జగన్

- శెట్టిబలిజ నేత, ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు
- కన్నబాబుకు ఓటు వేయడమంటే మనల్ని మనం గౌరవించుకున్నట్టే



ఆత్మీయ సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు, చిత్రంలో ఎమ్మెల్యే కన్నబాబు

కాకినాడ రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గొప్ప మానవతావాది అని, మహిళల ఆర్థిక పరిపుష్టి కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారని ఎమ్మెల్సీ, శెట్టిబలిజ నేత కుడుపూడి సూర్యనారాయణరావు అన్నారు. కాకినాడ రమణయ్యపేట వైద్యనగర్‌లో రూరల్ నియోజకవర్గ శెట్టిబలిజ పెద్దలతో శుక్రవారం ఆయన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యుడు నురుకుర్తి రామకృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఎమ్మెల్సీ సూర్యనారాయణరావుతో పాటు వైఎస్సార్ సీపీ కాకినాడ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి కురసాల కన్నబాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా సూర్యనారాయణరావు మాట్లాడుతూ జగనన్నను కూటమి పేరుతో చంద్రబాబు అడ్డుకోవాలని కుట్ర పన్నుతున్నారన్నారు. దీనికి కేంద్రం వత్తాసు పలుకుతుందన్నారు. చంద్రబాబుకు ఒక్క ఓటు వేసినా సరే మనకు సంకెళ్లు మనమే వేసుకున్నట్టు అని, కన్నబాబును గెలిపించుకుంటే శెట్టిబలిజలే ప్రతినిధ్యం వహించినట్టు అవుతుందన్నారు. కన్నబాబుకు ఓటు వేయడమంటే మనకు మనం గౌరవించుకున్నట్టేనని అన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో విద్య, వైద్యానికి పెద్దపీట వేశారన్నారు. శెట్టిబలిజ సంఘ నేతలు, గౌడ కులస్తులపై కరోనా సమయంలో నమోదైన కేసుల ఎత్తివేతకు సహకరించాలని కోరడంతో, దీనిపై సీఎం జగన్ దృష్టికి తీసుకువెళ్లి తక్షణమే హామీ ఇచ్చేలా కృషి చేస్తానని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కురసాల కన్నబాబు అన్నారు.

#### అన్ని కులాలకు సముచిత స్థానం

రాష్ట్రంలో సీఎం జగన్ అన్ని కులాలకు సముచిత స్థానం ఇచ్చారని, ముఖ్యంగా బీసీలకు ఎనలేని ప్రాధాన్యం ఇస్తున్నారని కురసాల కన్నబాబు అన్నారు. శెట్టిబలిజ సామాజికవర్గానికి చెందిన పిల్లి సుభాష్‌చంద్రబోస్, చెల్లుబోయిన వేణుకు సముచిత స్థానం ఇచ్చారన్నారు. రెండు లోక్‌సభ, రెండు ఎమ్మెల్సీలు బీసీలకు ఇచ్చారన్నారు. జనసేన పోటీ చేస్తున్న 21 స్థానాలలో ఒక్క శెట్టిబలిజకు కూడా సీటు ఇవ్వలేదన్నారు. తనకు నియోజకవర్గంలో 80 శాతం మంది శెట్టిబలిజలను తాను పేరుతో పిలిచేంత పరిచయం ఉందన్నారు. మొత్తం 11 శెట్టిబలిజ సామాజిక భవనాలు కట్టించామన్నారు. శెట్టిబలిజల సంక్షేమం కోసం ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు కృషి చేస్తున్నారన్నారు. తనకు మద్దతుగా సామాజికవర్గ పరంగా పనిచేయడం ఆనందంగా ఉందన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యులు నురుకుర్తి రామకృష్ణ, గుబ్బల తులసీకుమార్, కరప ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి సత్తిబాబు, ఏఎంసీ చైర్మన్ గీసాల శ్రీను, యనమదల రవి, మాజీ మేయర్ పి.సరోజ, మాజీ కార్పొరేటర్ ఎల్లబోయిన చిన్న, శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ అనుసూరి ప్రభాకర్, గంజా సత్తిబాబు, గీసాల శ్రీనివాసరావు, కోట వెంకటేశ్వరరావు, గణేష్, కొప్పిశెట్టి గణేష్, ఎంపీటీసీ వాసంశెట్టి సత్యవేణి, వాసంశెట్టి రాజేశ్వరరావు, కాదా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన తూరంగి డ్రైవర్స్ కాలనీ వాసులు

#### వైఎస్సార్ సీపీలో చేరికలు

కాకినాడ రూరల్: తూరంగి గ్రామంలోని డ్రైవర్స్ కాలనీకి చెందిన పలువురు టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ కార్యక్రమం ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు సమక్షంలో శుక్రవారం రమణయ్యపేట క్యాంపు కార్యాలయం వద్ద జరిగింది. తూరంగి గ్రామ వైఎస్సార్ సీపీ నాయకుడు గొల్లపల్లి బాబులు ఆధ్వర్యంలో కోండ్రపు మణి, పెట్ల లక్ష్మి, సబితారెడ్డి, చిన్న, లక్ష్మి, బాలాజీ, బుజ్జి, శివ కిరణ్ తదితరులు చేరడంతో వారికి పార్టీ కండువాలను కన్నబాబు, సూర్యనారాయణరావు వేసి స్వాగతించారు. వైఎస్సార్ సీపీ విజయం కోసం కష్టపడి పనిచేయాలని కోరారు.

#### వేళంగికి చెందిన కార్యకర్తలు..

కరప మండలం వేళంగి గ్రామానికి చెందిన పలువురు టీడీపీ, జనసేన కార్యకర్తలు వైఎస్సార్ సీపీలోకి ఎమ్మెల్యే అభ్యర్థి కురసాల కన్నబాబు సమక్షంలో చేరారు. రమణయ్యపేట క్యాంపు కార్యాలయం వద్ద వేళంగి గ్రామ వైఎస్సార్ సీపీ నాయకుడు ముదుగు కృష్ణ ఆధ్వర్యంలో చిట్టూరి అప్పన్న, సోమభత్తుల ప్రసాద్, చిన్నం శేఖర్, ఎర్ర సతీష్, నిర్మలరావు, కాంతారావు, కురం వీర్రాజు, దాట్ల దుర్గా ప్రసాద్, ఆలపాటి రాజ్‌కుమార్, కేదాసి రమణ, ఊడ నరేష్, మార్నెళ్ల సత్తిబాబు తదితరులు 30 మంది చేరారు. వీరికి పార్టీ కండువాలను కన్నబాబు వేసి సాదరంగా ఆహ్వానించారు.

### చంద్రబాబువి మోసపూరిత హామీలు

- కూరాడలో ఎమ్మెల్యే కన్నబాబు



కూరాడలో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి కురసాల కన్నబాబు

కరప: రాష్ట్రంలో నవరత్న పథకాలతో నవశకానికి నాంది పలికిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు మద్దతు తెలిపి గెలిపించాలని వైఎస్సార్ సీపీ కాకినాడ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి కురసాల కన్నబాబు కోరారు. కూరాడలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలసి ఆయన ఎన్నికల ప్రచారం చేశారు. ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ పాలనలో అభివృద్ధి, సంక్షేమ పథకాలతో గ్రామాల్లోని ప్రజల జీవన స్థితిగతులు మెరుగుపడ్డాయన్నారు. పేద, మధ్యతరగతి ప్రజలు సంతోషంగా జీవిస్తుంటే చంద్రబాబు ఓర్వలేక పోతున్నారన్నారు. పింఛన్ల పంపిణీలో కూడా కూటమి నాయకులతో కుట్రలు చేయించి, ఇంటింటికీ వెళ్లి అందజేయకుండా అడ్డుకోవడం దారుణమన్నారు. ఎన్నికలొచ్చేసరికి చంద్రబాబు మోసపూరిత హామీలిస్తున్నారని అన్నారు. ఎన్నికల్లో కూటమి నాయకులకు ఓటు ద్వారా తగిన గుణపాఠం చెప్పాలన్నారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కన్నబాబు కోరారు. గ్రామ సర్పంచ్ రావుల శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ రావుల ప్రసాద్, ఎంపీటీసీ గుత్తుల శాంతి, మండల పార్టీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, మండల యూత్ అధ్యక్షుడు పెంకే సత్తిబాబు, మండల జేఎస్‌పీ ఇన్‌చార్జి కాదా వెంకటేశ్వరరావు, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కోట వెంకటేశ్వరరావు, నాయకులు చిన్నం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# మీరే బలం.. బలగం

- వైఎస్సార్ సీపీకి దీవెనలు అందించండి
- ఎన్నికల ప్రచారంలో ద్వారంపూడి కుటుంబం



ఎన్నికల ప్రచారం చేస్తున్న ద్వారంపూడి కుమార్తె డాక్టర్ ప్రణీత

కాకినాడ: మీరే మా బలం.. బలగం. మీ చల్లని ఆశీస్సులు వైఎస్సార్ సీపీకి అందించండి. కాకినాడను అన్ని రంగాల్లో ప్రగతి పథాన నిలిపిన ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డిని మరోసారి గెలిపించండంటూ ఆ పార్టీ కాకినాడ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి కుటుంబం విస్తృతంగా ప్రచారం చేసింది. ద్వారంపూడి కుమార్తె డాక్టర్ ప్రణీత, అల్లుడు డాక్టర్ ఉదయ్‌శేఖర్‌రెడ్డి, డాక్టర్ హర్షవర్ధన్‌రెడ్డి వేర్వేరు ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. శుక్రవారం స్థానిక 10వ డివిజన్ దుమ్ములపేట ప్రాంతంలో ద్వారంపూడి కుమార్తె డాక్టర్ ప్రణీత, రాష్ట్ర రైసుమిల్లర్ల సంఘ అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డి సతీమణి మాధురి, ఇతర కుటుంబ సభ్యులు పర్యటించారు. దుర్గగుడి పాకలు, తారకరామనగర్‌లలో ఇంటింటికి వెళ్లి ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్, ఎమ్మెల్యే అభ్యర్థి ద్వారంపూడిలను ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. మత్స్యకార ప్రాంతంలోని అవ్వ, తాతలు, మహిళలను ఆత్మీయంగా పలుకరించి, చేసిన అభివృద్ధిని వివరిస్తూ ప్రచారాన్ని కొనసాగించారు. ద్వారంపూడి గెలిస్తే దుమ్ములపేట ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేస్తారని తెలిపారు. నాయకులు వాసుపల్లి కృష్ణ, వాసుపల్లి రాంబాబు, ఎరిపల్లి సీతారామ్, పేర్ల దుర్గారావు, తిరిది సత్యం, వాసుపల్లి సతీష్, తిరిది కొండబాబు తదితరులు ఉన్నారు. స్థానిక 41వ డివిజన్‌లో ద్వారంపూడి అల్లుడు ఉదయ్‌శేఖర్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కమలాదేవి వీధి, చామంతివారివీధి, రెడ్‌క్రాస్‌ల వీధుల్లో పర్యటించిన ఆయన 2019 తరువాత జరిగిన కాకినాడ నగర అభివృద్ధిని గుర్తించి ద్వారంపూడిని గెలిపించాలని కోరారు. మాజీ కార్పొరేటర్ గోడి సత్యవతి వెంకట్, నాయకులు జి.రాకేష్‌రెడ్డి, కృష్ణ, రాకేష్, వాసు, మోహన్, అనంత ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే మరో అల్లుడు విష్ణువర్ధన్‌రెడ్డి కూడా వేర్వేరు ప్రాంతాల్లో ప్రచారం చేశారు.



ద్వారంపూడికి మద్దతుగా ప్రచారం చేస్తున్న అల్లుడు ఉదయ్‌శేఖర్‌రెడ్డి



వైఎస్సార్ సీపీ కరపత్రాలు అందిస్తున్న సినీ హీరో విజయ్‌కృష్ణారెడ్డి

#### సినీ హీరో కృష్ణారెడ్డి ప్రచారం

గణ, దుర్మార్గుడు, పాగల్, గోవిందా–గోవిందా చిత్రాల్లో హీరోగా నటించిన విజయ్‌కృష్ణారెడ్డి వైఎస్సార్ సీపీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డికి మద్దతుగా ఇక్కడ ఎన్నికల ప్రచారం చేశారు. 12వ డివిజన్ ఏఎంజీ స్కూల్ ప్రాంతంలో ఆయన ఇంటింటా పర్యటించారు. గడచిన ఐదేళ్లలో ద్వారంపూడి చేసిన అభివృద్ధిని వివరిస్తూ మరోసారి గెలిపించాలని కోరారు. ఆయన వెంట ఆదిత్యరాము, జితేంద్రసింగ్, భీమ్‌సింగ్, రాజా, భాస్కరరెడ్డి, కర్రి బుచ్చిరెడ్డి తదితరులు ఉన్నారు.

## సంక్షేమం, అభివృద్ధిని చూసి ఓటెయ్యండి



కరపలో ప్రచారం చేస్తున్న జెడ్పీటీసీ, ఎంపీపీ, సర్పంచ్ తదితరులు

కరప: కాకినాడ రూరల్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే కురసాల కన్నబాబు చేసిన అభివృద్ధిని, పేదలకు ఇళ్ల స్థలాల పంపిణీ, పథకాల అమలును చూసి ఫ్యాన్ గుర్తుపై ఓటెయ్యాలని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే సంక్షేమ పథకాలు కొనసాగుతాయన్నారు. ప్రతిపక్ష కూటమి మాయమాటలు నమ్మి మోసపోవద్దన్నారు. వైఎస్సార్ సీపీ విడుదల చేసిన మేనిఫెస్టోను వివరిస్తూ ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంచారు. ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ కాకినాడ రూరల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కురసాల కన్నబాబు, ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్‌ను గెలిపించడం ద్వారా జగనన్నను ఆశీర్వదించాలని ఓటర్లను కోరారు. గొర్రిపూడిలో వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు చీకాల సుబ్బారావు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు చీకాల అప్పలరాజు, పుణ్యమంతుల తాతాజీ, ఎర్రంనీడి సుబ్రహ్మణ్యం, వై.పండు, శ్రీపాదం వీరభద్రరావు, ఎర్రంనీడి వెంకటరమణ, కేతా శ్రీను, కానూరి శ్రీహరి, పాలాని సోమరాజు, కేతా వెంకటరమణ, కరపలో జెడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, వైస్ ఎంపీపీ పాట్నీడి భీమేశ్వరరావు, మండల యూత్ అధ్యక్షుడు పెంకే సత్తిబాబు, గ్రామ కమిటీ అధ్యక్షుడు మేడిశెట్టి సత్తిబాబు, శ్రీపాదం మురళీకృష్ణ, నక్కా సత్తిబాబు, ముద్రగడ వీరబాబు, వారాడలో సర్పంచ్ అడబాల సత్య, ఎంపీటీసీ చక్కపల్లి ఫకీర్రావు, గ్రామ కమిటీ నాయకులు అడబాల ప్రసాద్, ఈశ్వరరావు, అడబాల బుచ్చిబాబు ప్రచారం చేశారు.

## నేటి నుంచి పోస్టల్ బ్యాలెట్



పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్‌లో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఆర్వో వెంకటరావు

కాకినాడ: జిల్లా పరిధిలోని వేర్వేరు ప్రాంతాల్లో ఎన్నికల విధులు నిర్వర్తిస్తూ కాకినాడలో ఓటర్లుగా నమోదైన ఉద్యోగులు ఓటు హక్కు వినియోగించుకునేందుకు శనివారం పోస్టల్ బ్యాలెట్ అవకాశం కల్పించారు. దీనికోసం స్థానిక పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫెలిసిటేషన్ సెంటర్ ఏర్పాటు చేశారు. ఆయా తేదీల్లో ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఫెలిసిటేషన్ సెంటర్ పనిచేస్తుంది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జె.వెంకటరావు శుక్రవారం సాయంత్రం పర్యవేక్షించారు. రిటర్నింగ్ అధికారి వెంకటరావు మాట్లాడుతూ శనివారం పీవో, ఏపీవోలకు, ఐదు, ఆరు తేదీల్లో ఓపీఓలు పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవచ్చన్నారు. అలాగే రిటర్నింగ్ అధికారికి 12/12డి ద్వారా దరఖాస్తు చేసుకుని అత్యవసర విధుల్లో ఉన్న పోలీస్, ఇతర విభాగాల సిబ్బంది మాత్రం నాలుగు నుంచి ఏడో తేదీ వరకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చని చెప్పారు.

కాకినాడ రూరల్: పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునేందుకు రూరల్ నియోజకవర్గంలో రమణయ్యపేట ఏపీఎస్పీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాట్లు పూర్తి చేశారు. రూరల్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఇట్ల కిశోర్ మీడియాతో మాట్లాడుతూ శనివారం పోలింగ్ ఆఫీసర్లు, సహాయ పోలింగ్ ఆఫీసర్లు, మైక్రో అబ్జర్వర్లు, ఆది, సోమవారాల్లో ఇతర పోలింగ్ సిబ్బంది, పోలీస్, అత్యవసర సర్వీసుల సిబ్బంది, డ్రైవర్లు, వీడియో గ్రాఫర్లు ఓటుహక్కు వినియోగించుకోవచ్చన్నారు.

### మైక్రో అబ్జర్వర్ల ర్యాండమైజేషన్ పూర్తి

కాకినాడ సిటీ: మైక్రో అబ్జర్వర్ల ర్యాండమైజేషన్ ప్రక్రియ శుక్రవారం పూర్తి చేశారు. కలెక్టరేట్ ఎన్ఐసీలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జె.నివాస్ జిల్లా పరిశీలకులు ఎస్.గణేష్, రాజేష్ జోగ్‌పాల్, పోలీసు పరిశీలకుడు టీపీ శివకుమార్, జిల్లా ఎస్పీ ఎస్.సతీష్ కుమార్, వ్యయ పరిశీలకుడు సాధిక్ అహ్మద్, ఆసిఫ్, యోగేష్ కుమార్‌ల సమక్షంలో ఈ ప్రక్రియ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉన్న 356 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ ప్రక్రియను పర్యవేక్షించేందుకు మైక్రో అబ్జర్వర్లను నియమించామన్నారు. ర్యాండమైజేషన్ ప్రక్రియ ద్వారా వీరికి పోలింగ్ కేంద్రాలు కేటాయించామన్నారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో పని చేస్తున్న సుమారు 415 మందిని మైక్రో అబ్జర్వర్లుగా నియమించామన్నారు. ట్రైనీ కలెక్టర్ హెచ్ఎస్ భావన, డీఆర్ఓ డి.తిప్పేనాయక్, సీపీఓ పి.త్రినాథ్, ఎన్ఐసీ డైరెక్టర్ సీహెచ్ సుబ్బారావు, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీరమణి పాల్గొన్నారు.

### నూతన ఆవిష్కరణలకు నాంది పలకాలి



కార్యక్రమంలో పాల్గొన్న జేఎన్‌టీయూకే ఉపకులపతి ప్రసాద్‌రాజు తదితరులు

కాకినాడ సిటీ: జేఎన్‌టీయూకే ప్రాంగణంలోని సెనేట్ హాలులో శుక్రవారం స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ (ఎస్ఎంఎస్) విభాగం ఆధ్వర్యంలో ఎక్లోర్–2024 మేనేజ్‌మెంట్ ఫెస్ట్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఉపకులపతి జీవీఆర్ ప్రసాద్‌రాజు పాల్గొని మాట్లాడారు. నాయకత్వ లక్షణాలు అలవర్చుకుని నూతన ఆవిష్కరణలకు నాంది పలకాలన్నారు. మేనేజ్‌మెంట్ విభాగంలో హాస్పిటాలిటీ కోర్సు ప్రారంభిస్తామన్నారు. ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ తపోదన్ దెహ్రీ మాట్లాడుతూ విద్యార్థులు మేనేజ్‌మెంట్ ఫెస్ట్‌ల ద్వారా నేర్చుకున్న ఆధునిక పద్ధతులను రానున్న కాలంలో సంస్థలు లేదా కంపెనీలలో అవలంబించేందుకు అవకాశం ఉంటుందన్నారు. రెక్టార్ కేవీ రమణ, రిజిస్ట్రార్ ఎల్.సుమలత మాట్లాడుతూ మేనేజ్‌మెంట్ విద్యార్థులు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా అనలిటిక్స్‌పై పట్టు సాధించి కంపెనీలకు అవసరమైన జ్ఞానాన్ని సముపార్జించాలన్నారు. ఎంఎస్ఎస్ విభాగం డైరెక్టర్ ఎ.కృష్ణమోహన్ పాల్గొన్నారు.

### దరఖాస్తుల ఆహ్వానం

కాకినాడ సిటీ: కేంద్ర ప్రభుత్వం మహిళాభివృద్ధి శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో చైల్డ్ రైట్స్ అవార్డులు అందించేందుకు జిల్లాలో అర్హుల నుంచి దరఖాస్తులు కోరుతున్నామని ఆ శాఖ జిల్లా అధికారి కె.ప్రవీణ అన్నారు. ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పుష్కర్ అవార్డు పొందేందుకు వివిధ విభాగాలు, స్పోర్ట్స్, ఆర్ట్స్, కల్చరల్‌లో విశేష ప్రతిభావంతులై ఉండాలన్నారు. సమాజ సేవ, వివిధ రంగాల్లో ధైర్య సాహసాలు ప్రదర్శించిన వారు అర్హులన్నారు. పూర్తి వివరాలతో జూలై 31 తేదీ లోపు దరఖాస్తు అందించాలన్నారు.